సాక్షి
పెద్దపల్లి
శనివారం ၊ 12 ၊ ఆగస్టు ၊ 2023





**దళితులు ఆర్థికంగా ఎదగాలి**

నిరుపేద దళిత కుటుంబాలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అవసరమైన సాయం అందించి అండగా ఉంటుందని మంత్రి ఈశ్వర్ పేర్కొన్నారు. 10లో▸



**గద్దర్‌కు నివాళి**

గోదావరిఖని: ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /25.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

## న్యూస్‌రీల్

### అర్హులకు ప్రభుత్వ పథకాలు కేటాయించాలి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన బీసీ, మైనార్టీ, గృహలక్ష్మి పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులకు కేటాయించాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గంలో గృహలక్ష్మికి 25,234 దరఖాస్తులు వచ్చాయని, కేవలం మూడువేలు మంజూరు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. నియోజకవర్గంలో 3,500 మంది బీసీ బంధుకు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ప్రభుత్వం 2,565 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించిందన్నారు. అనంతరం కమాన్‌పూర్, మంథని, రామగిరి, పాలకుర్తి మండలాలకు చెందిన 89 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 35 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు.

### ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి



మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

పెద్దపల్లిరూరల్: తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్‌ఎంలు పెద్దపల్లి బస్టాండ్ వద్ద శుక్రవారం మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం అన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డామని, శనివారం కలెక్టర్ కార్యాలయం ముందు వంట వార్పు నిర్వహిస్తామని సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూప పేర్కొన్నారు. నిరసనలో సునీత, రాణి, రాజేశ్వరి, నిర్మల, రమ, అరుణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ జెండాతో తపాలా సిబ్బంది బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీ తీస్తున్న తపాలా శాఖ అధికారులు

పెద్దపల్లిరూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం తపాలాశాఖ ఆధ్వర్యంలో ఘర్‌ఘర్ తిరంగా నినాదంతో పట్టణంలో జాతీయ జెండాలను చేతబూని బైక్‌ర్యాలీ నిర్వహించారు. డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, డీసీపీ వైభవ్‌గైక్వాడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జాతీయజెండాను అందించారు. జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయజెండాలు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. కేవలం రూ.25 చెల్లించి జాతీయజెండాను పోస్టాఫీసులో పొందవచ్చని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తపాలా శాఖ అధికారులు సునీల్‌కుమార్, మోహన్, రాజు పాల్గొన్నారు.

### రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): రాజ్యాధికారం కోసం ముదిరాజ్‌లు పోరాటం చేయాలని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం మండలశాఖ నేతృత్వంలో ముదిరాజ్‌లు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో నర్సయ్యను మండల అధ్యక్షుడు కలవేన రమేశ్, ముదిరాజ్‌లు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... మత్స్య సహకార సంఘం కార్యాలయ భవనాలకోసం మండలానికో ఎకరం స్థలం, పద్దెనిమిదేళ్లు నిండిన మత్స్యకారులకు సభ్యత్వం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ కోసం టికెట్లు కేటాయించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తీగల స్వప్న, ఓదెల రవి, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ ఈర్ల శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, రేకుల రఘు, పిట్టల శంకర్, సాంబయ్య, మల్లేశ్, కుంబం రాజయ్య, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపైనే ‘సిట్టింగ్’!

**స్థలం: రామగిరి మండల కేంద్రం**
**సమయం: రాత్రి 7 గంటలు**



రామగిరి మండల కేంద్రంలోని వైన్స్ పరిసరాల్లో మందుబాబులు బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. ఓ వైన్స్‌లో పర్మిట్‌రూం పైన ఉందని, మరోచోట లోపల ఉందని.. అక్కడివరకు వెళ్లే ఓపిక లేక అలా వైన్స్ ఎదుటే మద్యం సేవిస్తున్నారు. దీంతో ఈమార్గం గుండా వెళ్లే ప్రజలు సాయంత్రం అయితే బయటకు రావడానికి భయపడుతున్నారు.

**స్థలం: గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్**
**సమయం: రాత్రి 8 గంటలు**



“ గోదావరిఖని సంజయ్‌నగర్ ఏరియాలోని వైన్స్‌లో పర్మిట్ రూం ఉన్నా మందుబాబులు అక్కడ సేవించకుండా, వైన్స్ ముందే పనికానిచ్చేస్తున్నారు. అక్కడ వద్దనేవారు, వారించేవారు లేకపోవడంతో పొద్దుపోయే వరకు మత్తులో తూలుతున్నారు. సుమారు అరగంట సేపు ఈప్రాంతంలో ఉన్నా ఎలాంటి పోలీస్‌గస్తీ వాహనం రాలేదు.

**స్థలం: పెద్దపల్లి బస్టాండ్ ఏరియా**
**సమయం: రాత్రి 7.30 గంటలు**



వీరందరూ దర్జాగా మద్యం సేవిస్తూ కనిపిస్తున్న ఈచిత్రం నిత్యం వందలాది మంది ప్రయాణించే పెద్దపల్లి బస్టాండ్ పరిసరాల్లోనిది. పర్మిట్‌రూం ఉన్నా పట్టించుకోకుండా బహిరంగంగా ఫుల్‌గా తాగుతూ మత్తులో చిత్తవుతున్నారు. కొందరు అక్కడే తాగి పడిపోతున్నారు. దీంతో ఈమార్గం గుండా రాకపోకలు సాగించే మహిళలకు ఇబ్బందికరంగా మారింది.

- చీకటి పడితే మందుబాబుల ఇష్టారాజ్యం
- దుకాణాల ఎదుటే తాగుతున్న వైనం
- మహిళలు, యువతులకు ఇబ్బందులు
- పోలీసులు, ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ కరువు

సాక్షి,పెద్దపల్లి: జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా వైన్స్‌లు బార్లను తలపిస్తున్నాయి. రాత్రయితే వైన్స్‌ల వద్ద మందుబాబుల ఆగడాలకు హద్దే ఉండదు. ఇష్టారాజ్యంగా రహదారులపై వాహనాలు నిలపడం, వీలైతే పర్మిట్ రూం లేదంటే వైన్స్‌ను ఆనుకుని ఉన్న ఇళ్ల గద్దెలపైనే కూర్చుని తమ పని కానిచ్చేస్తున్నారు. చీకటిపడితే చాలు జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు. జనసంచారం తక్కువగా ఉండే శివారు ప్రదేశాల్లో గంజాయి సేవిస్తూ తూలుతున్నారు. పట్టణశివారు కాలనీలు, పల్లెల పొలిమేరలు, చెరువుగట్టు, నిర్జన ప్రపదేశాలు మద్యం, సిగరెట్ స్మోకింగ్‌కు అడ్డాలుగా మారిపోతున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవు, ఎవరూ ఆరుబయట తాగొద్దు, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని అధికారులు హెచ్చరిస్తున్నా.. మత్తులో ఏం చేస్తున్నామో తెలియక మందుబాబులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. పరిమితి ఎక్కువై తూలుతున్నారు. కొన్ని సందర్భాల్లో నడవడానికి వీలుకాక పడిపోతున్నారు. మత్తెక్కించే గంజాయి సిగరెట్లు బహిరంగంగా విక్రయిస్తున్నా పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ మిన్నకుండి పోవడంతో వ్యసనపరుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. దీంతో ఇతరులకు, ముఖ్యంగా మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈమేరకు శుక్రవారం రాత్రి 8 నుంచి 10 గంటల వరకు ‘సాక్షి’ చేపట్టిన విజిట్‌లో అనేక విషయాలు వెలుగుచూశాయి.

**ఆరుబయట..**

రోజువారీ కూలీలు, ఇతరత్రా పనులు చేసే చిరుద్యోగులు మద్యం దుకాణాల వద్ద పర్మిట్‌రూం అందుబాటులో ఉన్నా చాలావరకు వినియోగించుకోవడం లేదు. మందు కొనుగోలు చేసి మద్యం దుకాణాలు, రహదారుల పక్కన తమకు అనువుగా ఉన్న స్థలాలను ఎంచుకొని ఫుల్‌గా తాగేస్తున్నారు. పిచ్చాపాటిగా మాట్లాడుకోవడం, మద్యం మత్తులో వాగ్వాదం పెరిగి ఒకరికొకరు గొడవపడటం, నానా హంగామా చేయడం సర్వసాధారణంగా మారింది. దీంతో ఆ మార్గంలో వెళ్లేవారు, స్థానికంగా నివాసముండే వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇక ప్లాస్టిక్ గ్లాసులు, మద్యం సీసాలు రోడ్లపక్కన, డ్రైయినేజీల్లో పడేస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో వైన్స్ ముందు, శివారు ప్రాంతాల్లో రోడ్లపైనే సిట్టింగ్స్ వేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలిని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రెండు శాఖలతోనే సరి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్



హాజరైన సభ్యులు

- సాదాసీదాగా జెడ్పీ సమావేశం
- వ్యవసాయం, వైద్యంపై చర్చ
- పాల్గొన్న మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

సాక్షి, పెద్దపల్లి: వ్యవసాయం, వైద్యఆరోగ్య శాఖలపైనే గంటన్నర సేపు జిల్లా సర్వసభ్య సమావేశం కొనసాగింది. ముఖ్యంగా జిల్లాలో వరదలతో నీటమునిగిన పంటపొలాలకు నష్టపరిహారం చెల్లించాలని సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. శుక్రవారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా, మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా బీసీ కుల వృత్తుల వారికి ఆర్థికసాయం, మైనార్టీ సంక్షేమం, గృహలక్ష్మి పథకాలు అందిస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పరిష్కార వేదికగా జిల్లా ప్రజా పరిషత్**

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జిల్లా ప్రజా పరిషత్ సమావేశం పనిచేస్తుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గతంలో జెడ్పీ సమావేశాలు తాగునీరు, విద్యుత్ సమస్యలతో సాగేవని, నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, తెలంగాణ ప్రభుత్వం సమస్యను శాశ్వతంగా పరిష్కరించిందని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ మన చేతిలో ఉండదని, మరే రాష్ట్రంలో లేని విధంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల చొప్పున పరిహారం అందించిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సైతం ప్రభుత్వానికి నివేదిక పంపామని, సానుకూలంగా స్పందించి పరిహారం అందజేయడం జరుగుతుందన్నారు.

**వచ్చేసారి ఎమ్మెల్యేగా హాజరవుతా**

జెడ్పీ సమావేశాల్లో అనేక సమస్యలకు పరిష్కారం చూపామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా సహకరించిన సభ్యులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు ఎమ్మెల్యేగా గెలిచివస్తానని పేర్కొన్నారు.

## రామగుండం మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వర్



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వర్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సీహెచ్.నాగేశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పనిచేసిన నాగేశ్వర్‌ను గత నెల 15న ప్రభుత్వం రామగుండంకు బదిలీ చేసింది. కానీ ఆయన రామగుండం రావడానికి వెనకడుగు వేశారు. మరో మున్సిపాలిటీకి బదిలీ కావడానికి ప్రయత్నాలు కూడా చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రామగుండంలో పరిపాలన సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో బల్దియాలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్(ఈఈ)గా విధులు నిర్వహిస్తున్న జి.సుచరన్‌కు గత నెల 27న ఎఫ్ఏసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. కాగా, నాగేశ్వర్ చేసిన బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఎట్టకేలకు శుక్రవారం విధుల్లో చేరారు. నగర మేయర్ బంగి అనిల్ కుమార్‌ను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కమిషనర్‌ను కార్యాలయంలోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు వేర్వేరుగా సన్మానించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## ఎన్టీపీసీని సందర్శించిన డైరెక్టర్



స్టోర్స్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్, అధికారులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టును శుక్రవారం డైరెక్టర్ (ఆపరేషన్స్) రమేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఓఎస్) ఆర్నిదం సిన్హా సందర్శించారు. ఈసందర్భంగా డైరెక్టర్లకు సీజీఎం కేదార్‌రంజన్‌పాండుతో పాటు పలువురు అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ స్టేజీ–1లో నిర్మిస్తున్న 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల రెండు యూనిట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పర్మనెంట్ స్టోర్ రూం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రామగుండం ప్రాజెక్టు పనితీరుతో పాటు నూతనంగా విద్యుత్ ఉత్పత్తి దశలోకి చేరుకున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లోని 800 మెగావాట్ల మొదటి యూనిట్ వివరాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఉద్యోగ గుర్తింపు సంఘం, అధికారుల సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేభాశిస్ ఛటోపాధ్యాయ, ఏజీఎం హెచ్ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ ఉన్నత ఆశయాన్ని లక్ష్యంగా ఎంచుకుని దాన్ని సాధించాలనే పట్టుదల, తపనతో ముందుకు సాగాలని, అప్పుడే జీవితంలో ఉన్నతంగా ఉండగలుగుతారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. పెద్దపల్లిలోని జిల్లాపరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల, ఉర్దూమీడియం స్కూల్‌ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థి దశలో టెన్త్ క్లాస్ ఇంటికి పునాదిలాంటిదని, పునాది బలంగా ఉన్నపుడే భవిష్యత్తు బాగుంటుందన్నారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయుడు మురళీనాయక్‌తో మాట్లాడి మన ఊరు..మనబడి పనుల తీరుపై తెలుసుకున్నారు. మధ్యాహ్నం వంట నిర్వాహకురాలికి ప్రభుత్వం నుంచి అందుతున్న వేతనం తదితర విషయాలను తెలుసుకున్నారు. ఉర్దూమీడియం స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్ బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. బాలికలు కూడా చదువులో బాగా రాణించి ఉన్నతంగా ఎదగాలని సూచించారు.

### 16న వేలం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రేషన్‌బియ్యాన్ని బహిరంగ వేలం ద్వారా అమ్మాలని నిర్ణయించామని ఆడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. ఈనెల 14లోగా ధరావత్తు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని, 16న బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. జిల్లాలో దాదాపు 3,300 క్వింటాళ్ల బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ గోదాంలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తిగలవారు రూ.25వేలు ధరావత్తుగా (తిరిగి చెల్లించబడదు) చె ల్లించాలన్నారు. ఈనెల 14లోగా జిల్లా పౌరసరఫ రాల అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. ఈనెల 16న అదనపు కలెక్టర్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## కరకట్టల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

మంథని: మానేరులో వరద ఎక్కువ వచ్చినప్పుడు ముంపు లేకుండా తీర ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సూచించారు. శుక్రవారం తన నివాసంలో నీటిపారుదల శాఖ ఈఈ బలరామయ్య, డీఈఈ రమేశ్‌బాబుతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని అడవిసోమన్‌పల్లి మానేరులో చెక్‌డ్యాం నిర్మాణం చేపడితే వరదలతో కొట్టుకుపోయిందని, దీంతో రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేయగా, అనేక భూములు కోతకు గురయ్యాయన్నారు. రైతులు నష్టపోకుండా ఇసుక మేటలు తొలగించి కోతకు గురైన ప్రాంతాల్లో మట్టి నింపాలని ఆదేశించారు. రైతుల కు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

# నగరం అపరిశుభ్రం.. ఇబ్బందుల్లో జనం

- గోదావరితీరాన డంపింగ్ యార్డు
- చిన్నవర్షాలకే బురదమయంగా రోడ్లు
- భారీ వర్షాలకు వరదనీటిలో కలిసిన చెత్త



రోడ్డుపై ధర్నా చేస్తున్న రాజ్‌ఠాగూర్ (ఫైల్)



గోదావరి తీరంలో చెత్తను డంపింగ్ చేస్తున్న వాహనాలు

గోదావరిఖని: ఇటీవల భారీ వర్షాలతో రామగుండం కార్పొరేషన్‌లోని వీధులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. విషజ్వరాలు పెరిగిపోతున్నాయి. వరద నీటిలో మునిగిన లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా.. చాలారోడ్లు బురదమయంగా మారాయి. రోడ్లపైనే వరదనీరు నిలవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రధాన రోడ్లు మినహాయించి మిగిలిన రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. నిత్యం చెత్త తరలింపు కోసం కార్పొరేషన్ ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. నగరం పరిశుభ్రతకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఏకైక కార్పొరేషన్‌గా ఉన్న రామగుండంలో పాలన పడకేసిందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఏటా రూ.కోట్ల బడ్జెట్ ప్రవేశపెడుతున్నా.. పలుప్రాంతాలు ఇప్పటికీ మట్టి రోడ్లుగానే మిగిలాయి. చిన్న చినుకు పడినా వాహనాలు అటుంచితే కనీసం నడవడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. కార్పొరేషన్‌లోని లోతట్టు ప్రాంతాల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. మల్కాపూర్, నర్రశాలపల్లి, మేడిపల్లి, జనగామ, సప్తగిరికాలనీ, గంగానగర్, ఉదయ్‌నగర్ ప్రాంతాల్లో చాలామటుకు వరద నీరు చేరుతోంది.

**అస్తవ్యస్తంగా కార్పొరేషన్ రోడ్లు**

కార్పొరేషన్‌లో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడంతో పలు రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పలుచోట్ల సెంట్రల్ డ్రైనేజీ పేరుతో రోడ్డును తొలగించిన అధికారులు.. వాటిని ఇంకా పూర్తి చేయలేకపోయారు. అలాగే కొత్తగా ఏర్పాటైన పలు కాలనీల్లో ఇప్పటికీ సీసీ రోడ్ల పనులు మొదలుపెట్టలేదు. దీంతో చిన్న వర్షం పడినా రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారుతోంది.

**గోదావరి తీరాన చెత్తడంపింగ్ యార్డు**

అతి పవిత్రంగా భావించే గోదావరినది తీరాన మున్సిపాలిటీ చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. నిత్యం వందలాది మంది తిరిగే ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది క్రితం వరకు సింగరేణి యాజమాన్యం తన స్థలాన్ని చెత్త డంపింగ్ చేసేందుకు కేటాయించడంతో ఇబ్బంది ఏర్పడలేదు. ఓసీపీ–3 విస్తరణతో చెత్త డంపింగ్ యార్డును సింగరేణి ఎత్తివేసింది. ప్రస్తుతానికి డంపింగ్ యార్డు లేకపోవడంతో గోదావరినది తీరంలోని సమ్మక్క గద్దెల వద్ద చెత్తను పడేస్తున్నారు. దీంతో పుణ్యస్నానాలకు వెళ్లే ప్రజలు, అంత్యక్రియలకు, మిగితా పనుల కోసం అటువైపుగా వెళ్లే వారు వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ డంపింగ్ యార్డు మునిగి గోదావరినదిలోకి చెత్త వెళ్లింది. ఈప్రాంతం నీటిలో మునగడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

**సీజనల్ వ్యాధులతో బెంబేలు**

భారీ వర్షాలతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వాతావరణంలో మార్పులు రావడంతో సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఇప్పటికే కళ్ల కలక వ్యాధి రామగుండంలో విజృంభించింది. దోమల బారిన పడి చాలా మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. డెంగీ జ్వరాలు పెరిగిపోతున్నాయి. భారీ వర్షాలు తగ్గిన తర్వాత సీజనల్ వ్యాధులు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

| | |
|---|---|
| చెత్త సేకరణ వాహనాలు | 63 (ట్రాలీఆటోలు, ట్రాక్టర్లు, వ్యాన్లు) |
| నిత్యం చెత్త సేకరణ | 40 టన్నుల పొడి, 80 టన్నుల తడిచెత్త |
| దంప్ యార్డు | 2 (గోదావరితీరంలోని సమ్మక్క గద్దెల వద్ద, యైటింక్లయిన్‌కాలనీ సమీపంలో) |
| పారిశుద్ధ్య కార్మికులు | 492మంది |
| ఫాగింగ్ | డివిజన్‌కు ఒక్కరోజు |

## క్లుప్తంగా

### విద్యార్థుల ప్రతిజ్ఞ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రోగ్రాం కన్వీనర్ సంపత్‌రావు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చీకురాయి రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మేరీ మాటీ –మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ పొల్సాని సంపత్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులతో సామూహిక పంచప్రాణాల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పెద్దపల్లి అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, బీజేపీ సీనియర్ నాయకుడు తంగేడ రాజేశ్వర్ రావు, మేరీ మాటి–మేర దేశ్ ప్రోగ్రాం అసెంబ్లీ ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీకాంత్, పెద్దపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, పార్లమెంట్ విస్తారక్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం



గ్రామస్తులతో విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్‌తోనే ప్రజల సమస్యలు తీరుతాయని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరమణారావు ఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించడంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన మనోహర్‌రెడ్డి అవినీతికి కేరాఫ్‌గా మారారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాష్‌రావు, జానీ, సతీష్, దామోదర్, పన్నాల రాములు, వెంకటేశ్వర్‌రావు, తిరుపతి, సంపత్ తదితరులున్నారు.

### రామగుండం బరిలో విద్యార్థుల రాజకీయ పార్టీ



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే బరిలో విద్యార్థుల రాజకీయ పార్టీ (వీఆర్‌పీ) ఉంటుందని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు హెచ్.సునీల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యువతరం, విద్యార్థుల భాగస్వామ్యంతో రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. అమరవీరుల కుటుంబాలు, విద్యార్థులు, మేధావులకు టికెట్లు ఇస్తామని తెలిపారు. ఉచిత విద్య, వైద్యం అందించడమే పార్టీ లక్ష్యమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో 2.61లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు.

**నియామకం**

వీఆర్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బమ్మెర మన్మోహన్‌ను నియమించినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్ తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు. నాయకులు కమలాకర్, నవీన్ రెడ్డి, అజయ్, నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# దళితులు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, తదితరులు

- స్వయం ఉపాధికి సర్కారు సాయం
- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- జిల్లాలో 184 మందికి రూ.50 వేల విలువగల యూనిట్ల పంపిణీ

పెద్దపల్లిరూరల్: నిరుపేద దళిత కుటుంబాలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అవసరమైన సాయం అందించి అండగా ఉంటుందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని 184 మంది దళితులకు చిరు వ్యాపారాలు, స్వయం ఉపాధి పనులు చేస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన యూనిట్ల (రూ.50వేల విలువగల)ను వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జెడ్పీ చైర్మన్ పుట్టమధు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దళితబంధు పథకం కింద లబ్ధిపొందిన వారు జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పథకాలు అమలవుతున్నాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. జిల్లాలో దళితుల సంక్షేమానికి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికప్రగతి సాధించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఈశ్వర్, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు యూనిట్ మెటీరియల్, రూ.10వేల చెక్కులను అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, శైలజ, జెడ్పీటీసీ, ఎంపీపీలు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మధుసూదనా శర్మ తదితరులు పాల్గొన్నారు.

**ఈడీ తీరుపై ఆగ్రహం**

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు యూనిట్లను పంపిణీ చేసే కార్యక్రమానికి సంబంధించి కనీస సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మధుసూదనా శర్మపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో మాట్లాడేందుకు తొలుత నిరాకరించినా మంత్రి ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ మధు సంబంధిత అధికారితో మాట్లాడి ఎమ్మెల్యేకు ఆహ్వానం లేకపోవడం ఏమిటన్నారు. ఆహ్వానించేందుకు తాను స్వయంగా ఎమ్మెల్యే ఇంటికి వెళ్లానని, మున్సిపల్ చైర్మన్‌కు, ఎమ్మెల్యే పీఏకు చెప్పినట్లు తెలిపారు. మరోసారి ఇలా పునరావృతం కాకుండా చూస్తామని తెలపడంతో వివాదం సద్దుమణిగింది.

**అధికారులతో లబ్ధిదారుల వాగ్వాదం**

ప్రభుత్వం తమకు మంజూరు చేసిన యూనిట్‌కు సంబంధించి రూ.40వేల విలువగల మెటీరియల్‌ను అధికారులు కొనివ్వడమేంటని పలువురు లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తాము ఆ మెటీరియల్‌ను తీసుకెళ్లమని స్పష్టంచేశారు. కమీషన్ల కోసమే సామగ్రిని కొన్నారని పలువురు ఆరోపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే చేశామని, ఇందులో తమ తప్పిదమేమీ లేదని అధికారులు సర్దిచెప్పి మెటీరియల్ తీసుకెళ్లాలని కోరారు.

**47 మందికి చెక్కులు పంపిణీ**

పెద్దపల్లి రూరల్: బీసీ కులవృత్తుల కోసం 47మందికి రూ.లక్ష సాయం చెక్కులను మంత్రి ఈశ్వర్ కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 300 మందికి పంపిణీ చేస్తామన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలో 29మంది జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ జారీచేసిన ఉత్తర్వు కాపీలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జెడ్పీ చైర్మన్ మధు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి అందజేశారు.

**ధరణి సహాయ కేంద్రం ప్రారంభం**

భూ సమస్యలను పరిష్కరించడంలో భాగంగా ప్రత్యేకంగా ధరణి సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి ఈశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో ధరణి సహాయ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. సమస్యలు, అనుమానాలు ఉన్నవారు ఈ కేంద్రంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 79950 70677 నంబర్‌లో ద్వారా ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

## ప్రభుత్వ భూముల అమ్మకాలను నిలిపివేయాలి



మాట్లాడుతున్న నగేశ్

ధర్మారం: ప్రభుత్వ భూముల అమ్మకాలను సీఎం కేసీఆర్ వెంటనే నిలిపివేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ధర్మారంలో విలేకరులతో మాట్లాడుతూ హెచ్ఎండీఏను అడ్డుపెట్టుకొని సీఎం కేసీఆర్ వేల ఎకరాల భూములను వేలం వేయడం దుర్మార్గమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో భూముల వేలాన్ని వ్యతిరేకించిన కేసీఆర్ వేల కోట్లు మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రంలో భూములను అమ్మడం ఎంతవరకు సమంజసమన్నారు. భూముల అమ్మకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మరో మూడునెలల్లో ఎన్నికల కోడ్ వస్తున్న తరుణంలో ప్రభుత్వం భూముల అమ్మకాలతో పాటు మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేసీఆర్ అనాలోచిత విధానాలతో విలువైన ప్రభుత్వ ఆస్తులను విక్రయిస్తుండటం సరికాదన్నారు. ఇదే విధానం కొనసాగుతే రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

## జీవన బంధు ప్రకటించాలి



మాట్లాడుతున్న రమేశ్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): దళిత బంధు వలె తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు జీవన బంధు ప్రకటించాలని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం యైటింక్లయిన్ కాలనీ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు, దళితులు, నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలోని పలు ఏరియాల్లో డ్రైనేజీ, రోడ్లు సరిగా లేవని, స్వచ్ఛమైన తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రజా సమస్యలను రామగుండం కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గం తరుపున పోటీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. గెలిపిస్తే రామగుండం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే ఈనెల 20న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ధర్నాలో ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, టీఎల్‌పీ నాయకులు అఖిల్‌వర్మ, చెరుకు పైడి, రజిత, కనకలక్ష్మి, పద్మ, కుమారి, దేవమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, ఓదెలు పాల్గొన్నారు.

## రామగుండం రైల్వేస్టేషన్‌లో యాచకుడు మృతి



అశోక్ మృతదేహం

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌లో కొంతకాలంగా తమిళనాడు రాష్ట్రం ధర్మపురికి చెందిన అశోక్ (55) అనే వ్యక్తి యాచకుడిగా కాలం వెల్లదీస్తున్నాడు. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తి కుడి మోకాలి వరకు తెగిపోయి ఉండడంతో కృత్రిమ కాలు అమర్చుకొని మెల్లమెల్లగా నడుస్తూ భిక్షాటన చేస్తున్నాడు. శుక్రవారం రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం దగ్గర పడుకొని ఎంతకీ కదలకపోవడంతో స్థానికులు పరిశీలించగా మృతిచెందినట్లు గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని రామగుండం ఏఎస్సై సుదర్శన్ పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభ్యమైన చిరునామా ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

### ఫిట్స్‌తో యువకుడు..



అరవింద్ మృతదేహం

అంతర్గాం మండల పరిధి ముర్మూర్ గ్రామానికి చెందిన జాడి అరవింద్ తన బంధువుతో కలిసి శుక్రవారం గ్రామ సమీపంలోని ఒర్రెలో చేపల వేటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఒడ్డుపై కూర్చుని గాలంతో చేపల వేట చేస్తున్న క్రమంలో అరవింద్(20)కు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో ఒడ్డుపై నుంచి నీటిలో పడి మునిగి మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

### గుండెపోటుతో ఒకరు..



నరేశ్‌రెడ్డి (ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని నారాయణపల్లికి చెందిన కరివేద నరేశ్‌రెడ్డి(35) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాలు.. నరేశ్‌రెడ్డికి శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లేసరికి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా నరేశ్‌రెడ్డి ఆరునెలల క్రితం ఎలిగేడుకు చెందిన సాయిప్రసన్నను ప్రేమవివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె గర్భిణి. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ మాడ కొండాల్‌రెడ్డి పరామర్శించారు.


### అంతర్జాతీయ రెస్క్యూ పోటీలకు సిద్ధంగా ఉండాలి



జీడీకే-7ఎల్ఈపీ గనిని సందర్శించిన డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): అంతర్జాతీయ రెస్క్యూ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదేశించారు. నవంబర్‌లో పోటీలు నిర్వహించనున్న జీడీకే-7ఎల్ఈపీ గనిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వ్యూపాయింట్ ద్వారా ఓసీపీ-3 పనిస్థలాలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి వేగవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు తదితరులున్నారు.


### ప్రపంచదేశాలకు దీటుగా భారత్



మహిళా కార్మికులతో సత్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): ప్రధాని నరేంద్ర మోదీ మన దేశాన్ని ప్రపంచ దేశాలకు దీటుగా అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్జీ-1 పరిధి జీడీకే-2వ గని, ఏరియా ఆసుపత్రి వద్ద ఉద్యోగులతో మాట్లాడారు. ప్రపంచ దేశాల ప్రజలు కరోనా బారిన పడి పిట్టల్లా రాలిపోతుంటే వారికి కూడా కరోనా వాక్సిన్ టీకాలను అందించి కాపాడిన గొప్ప వ్యక్తి మోదీ అన్నారు. తాను మున్సిపల్ చైర్మన్, రామగుండం ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు. తిరిగి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈప్రాంత అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, పిడుగు కృష్ణ, సోమారపు లావణ్య, కోదాటి ప్రవీణ్, జనగామ రాజలింగం, డేవిడ్ రాజు, మంచికట్ల భిక్షపతి, దీటి వెంకటస్వామి, బద్రి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఐఎఫ్‌టీయూను చర్చలకు ఆహ్వానించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించేంత వరకు ఐఎఫ్‌టీయూను సంస్థలో జరిగే చర్చలకు అన్ని సంఘాలతో కలిపి తమను ఆహ్వానించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్జీ-1 డీజీఎం పర్సనల్ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ సీఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిపిన 15 సంఘాలను చర్చల్లో భాగస్వామ్యులను చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, బి.అశోక్, ఎం.దుర్గయ్య, పి.మొండయ్య, సాంబయ్య, బొట్టు రవికుమార్, ఎండీ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

**బొగ్గుబాయి వార్తలు**

## ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



నూతన యంత్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం

రామగిరి: యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆర్జీ -3 జీఎం ఎన్.సుధాకర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ -2 గనిలో 75 టన్నుల సామర్థ్యం గల నూతన క్రేన్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాలను పూర్తిస్థాయిలో ఉపయోగించి రక్షణ ప్రమాణాలు పాటిస్తూ ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, రక్షణ అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ప్రాజెక్ట్ అధికారి కే.రాజేందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఎం.నాగరాజు, మేనేజర్ కేవీ.రామారావు, రక్షణ అధికారి ఆసిఫ్ యాసిన్, టీబీజీకేఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య పాల్గొన్నారు.

## వైఎస్సార్ హయాంలోనే సింగరేణికి లాభాలు



కార్మికులకు అభివాదం చేస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్సార్ హయాంలోనే సింగరేణి సంస్థ లాభాల బాటలో ఉందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల ఆశీర్వాద యాత్రలో భాగంగా శుక్రవారం జీడీకే-2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల కష్టార్జితంతోనే కార్మిక క్షేత్రంలో మెడికల్ కళాశాల ప్రారంభమైందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే చందర్ అవాస్తవాలు మాట్లాడి ఇక్కడి కార్మికులను మరోసారి మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కవడం వల్లే సింగరేణి సంస్థ ప్రైవేటీకరణ వైపు అడుగులు పడుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కార్మికులను కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ గెలుపు ఖాయం**

గోదావరిఖని: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ స్పష్టంచేశారు. మార్కండేయకాలనీలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పలువురు నాయకులు పార్టీలో చేరారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌లో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గుంపుల తిరుపతి, సత్యనారాయణ రెడ్డి, భూషణ్ ఆధ్వర్యంలో పాతిపెల్లి మల్లయ్య, ఆడెపు రవి, చుప్పరి మొగిలి, బొల్లవేని కుమార్, శ్రీనివాస్, గుండేటి రాంచందర్‌తో పాటు పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

గోదావరిఖని టౌన్: హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ వాహిని ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గోదావరి ఒడ్డున ఉన్న హిందూ శ్మశానవాటిక స్థలం వరదకు నీట మునిగిందన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సింగరేణి యాజమాన్యానికి పలుమార్లు విన్నవించినా ఇతర మతస్థులకు సింగరేణి స్థలాలను కేటాయించిందన్నారు. పెద్దసంఖ్యలో హిందువులు ఉన్న ఈ ప్రాంతంలో యాభై ఎకరాల సింగరేణి స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటరావు, జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, భజరంగ్ దళ్ జిల్లా ప్రముఖ్ సంపత్ యాదవ్, నగర కార్యదర్శి రవీందర్, సురేందర్, వెంకటస్వామి, హిందూవాహిని రాష్ట్ర కార్యదర్శి పైతరి రాజు, జిల్లా అధ్యక్షుడు రాగం శ్రీధర్, తిరుపతి, పవన్, సురేశ్, ములుకుంట్ల శ్రీనివాస్, అంజన్న, ఆకాశ్, కుమార్, సంపత్, అడిగొప్పుల రాజు, లింగన్న, సుధీర్, శ్రీనివాస్, శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కోర్టు కేసులపై వీడియో కాన్ఫరెన్స్

గోదావరిఖని: సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారంపై డైరెక్టర్(పా) బలరాం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్జీ-1, 2 ఏరియాల అధికారులతో వేర్వేరుగా మాట్లాడారు. ఏరియాలలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను సత్వరమే పరిష్కరించేందుకు తీసుకోవల్సిన మార్గదర్శకాలకు సూచించారు. సమావేశంలో కార్పొరేట్ వెల్ఫేర్ జీఎం బసమయ్య, ఐఆర్అండ్‌పీఎం జీఎం బి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. సమీక్ష సమావేశంలో ఆర్జీ-1 డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్జీ-2 ఏరియాలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

**జాతీయ జెండా ఎగరాలి**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ-1 ఏరియాలోని ఉద్యోగుల క్వార్టర్లపై జాతీయ జెండా ఎగరవేయాలని జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని క్వార్టర్లపై జాతీయ జెండా ఎగురవేసి సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేయాలన్నారు. ఈనెల 13నుండి 15వరకు జెండా ఎగరేలా చూడాలన్నారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

అజాదికా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం ఆర్జీ-1 ఏరియాలోని సెక్టార్-1 సింగరేణి పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

## ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



శ్రీనివాస్ రెడ్డి

గోదావరిఖని(రామగుండం): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 13 నుంచి 15వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఆర్జీ-2 ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని వివరించారు.న్నారు. 15న యైటింక్లయిన్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అభివృద్ధికి నోచుకోని కోల్‌బెల్ట్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

గోదావరిఖని: అభివృద్ధికి ఆమడదూరంలో కోల్‌బెల్ట్ ఏరియా ఉందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మణుగూరు నుంచి రామగుండం 200 కిలోమీటర్ల రైల్వేలైన్‌పై ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. అదే మంత్రులు ఉన్న ఏరియాల్లో సిరిసిల్ల, గజ్వేల్ ప్రాంతాలకు రైలుకూత వినిపిస్తోందని విమర్శించారు. రైల్వేలైన్ వస్తే ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే రైల్వేలైన్ వెనకబడిందన్నారు. 2013లో రామగుండం నుంచి మణుగూరు వరకు సుమారు రూ.1100 కోట్లతో ఈలైన్‌కు ప్రతిపాదన చేయగా, ప్రస్తుతం రెట్టింపుకు చేరుకుందన్నారు. సమావేశంలో నాయకులు స్వామి, రాంమూర్తి, రమేశ్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

## పశు వధశాలను వినియోగంలోకి తేవాలి



పశువధశాలను పరిశీలిస్తున్న నాయకులు

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధి మల్కాపూర్ శివారులో నిరుపయోగంగా ఉన్న పశు వధశాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. శుక్రవారం మల్కాపూర్ శివారులోని పశు వధశాలను పరిశీలించారు. రూ.43 లక్షలతో నిర్మించిన స్లాటర్ హౌజ్‌ను నిరుపయోగంగా మార్చారని, దీంతో వ్యాపారస్తులు నిబంధనలకు విరుద్ధంగా మేకలు, కోళ్లను ఎక్కడికక్కడ వధించి ఆ వ్యర్థాలను కాలువల్లో వదులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నగర కార్యదర్శి అసాల నవీన్, నాయకులు మండల శ్రీకాంత్, వినయ్, క్రాంతి పాల్గొన్నారు.